


బయల్దేరింది మొదలూ చూస్తున్నాను బసవయ్య వాలకం నాకేం అర్థంకాలేదు. తల్లీ, చెల్లెలూ, బావమరుదులూ, భార్యా మేనల్లుళ్లూ, నేనూ, తులసమ్మా, నిర్మల అనసూయా, యింతమందిమీ కలిసిఎంతో జాగ్రతగా, నేర్పుగా ప్రయాణం చేస్తున్నప్పటికీ- ఏమేమో వంకలతో, మా మంచి చెడ్డలు విచారించేందు కన్నట్లు— మాటిమాటికీ వచ్చి సౌభాగ్యం వంక తమాషాగా చూసేవాడు.

బలంగల విశాలమైన వక్షస్థలం ఖరీదైన సేలం అంచుపంచ, సిల్కులాల్చీ, బంగారు గొట్టంతో మెరిసేకలం, పలకల చేతిగడియారం, వెనక్కు దువ్విన క్రాపు, నున్నని కోల మొహం. ఏమన్నా కావాలా అని అడుగుతూ కిటికీలోంచి లోపలికి లోపలికి చూసేకళ్లూ, ఎంతో ఆకగా ఉండేవి.

'మాకేం అవసరం లేదు. వెళ్ళితొరగా కాఫీ తాగి బండెక్కండి.' అనేది సూయ.

ఆ మొగుణ్ని ఎక్కడ తినేస్తావో అన్న బాధతో, ఈర్ష్యతో మా అందరి తరఫునా వకాల్తా పుచ్చుకొని మ గేది అనసూయ.

ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నట్లు మాటలు తడబడుతున్నట్లు, సాభిప్రాయంగా ఓమారు సౌభాగ్యంవంక చూసి ఇంకా టైం వుందిలే అనుకుంటూ మెల్లిగా 'స్టాలు' వేపుకి వెళ్ళాడు.

సౌభాగ్యం తలెత్తి కొంచెం సేపు అటూఇటూ చూసి బసవయ్య బావమరి

తో కావల్సింది తెప్పించుకొని నావంక చూసేది.

‘చూశావా అనసూయ విరగబాటుతనం! ఆమొగుణ్ని అందరూ కోరుక్కుంటారని ఆ ఈర్ష్యా, అనసూయ ఎలా బైట పెట్టుకుంటుందో, అన్నట్లుగుండ్రని చిన్నకళ్ళు ఏదో తెలియని బాధని విచారాన్ని బైటపెడుతున్నట్లుగా కనబడేది.

తెలిసిన వాళ్ళూ ఒక పేటలోని వాళ్ళు గావడం వల్ల బసవయ్య కుటుంబంతో పాటు, బంధువులము గాక పోయినా, నేనూ- సౌభాగ్యంకూడా రామేశ్వర యాత్రకి బయలుదేరాము.

నాలానే సౌభాగ్యం కూడా ఒంటరిగానే బయలుదేరింది. సౌభాగ్యం పెనిమిటికి ఆఫీసులో శలవు దొరక్క పోవడం వల్లా, ఎన్నో సార్లు వ్యాపారం మీద దక్షిణదేశమంతా చూసి వుండడంచేతా చిన్నతనం నుంచీ బసవయ్య కుటుంబంతో పరిచయం వుండడంచేతా, ఎంతో నచ్చచెప్పి సౌభాగ్యాన్ని మాతో పంపాడు ఆయన.

‘ఏమోలే పోనీ పాపం ఎవరికన్నా ఏమన్నా కావాలేమో తెప్పించుకోండమ్మా!’ అనేది అనసూయ అత్త.

నాకు పట్టరానంత కోపమొచ్చేది. ‘మీ అబ్బాయిని మేమంతా పీక్కుతిన్నట్లు కష్టపడుతున్నట్లు మీకోడలు ఈర్ష్యగా చూస్తుంటే, మేమేం తెప్పించుకోం? ఏమని పలకరించం?’ అని అందామనుకుని ‘అంతా కలిసి యాత్రలికి బయల్దేరినపుడు పోట్లాడుకోవడం తగాదాలు పెంచుకోవడం, బాగుండదనే’ ఉద్దేశంతో మళ్ళీ లోపలికి గుటక వేసేదాన్ని.

ఎక్కడో ఏస్టేషనులోనో బండి ఆగినప్పుడు బావమరుదులతో పాటు బసవయ్య కూడా దిగేవాడు. బావమరుదులిద్దరూ ఎంక్వైరీ ఆఫీసు వద్దకి వెళ్ళి ఏయేబండ్లు ఎక్కడెక్కడ మారాలో ఏయేస్టేషన్లనించి వెళ్తేదగ్గరో, కనుక్కుంటుంటే—ప్లాట్ ఫారంమీద బసవయ్య పచార్లుచేస్తుండేవాడు.

అయిదురోజులకింద ఇలానే రాత్రిపూట చిదంబరంనించి కుంభకోణం పోతున్నాం. సామాన్లూ, ట్రంకులూ - బెడ్డింగులూ పైనపెట్టి, ఏదో లోకాభిరామాయణం మాట్లాడుకుంటున్నాము. పిండారబోసినట్లున్న ఆవెన్నెల్లో, పొలాల మీదినుంచి వచ్చే చల్లనిగాలి, వొళ్ళంతా తాకుతూ పోతుంటే, గిలిగింతలు పెట్టినట్లుగా, ఎంతో మృదువుగా తీయని కోర్కెల్ని రేపుతూవుంది! ఎటు చూచినా ప్రపంచమంతా నిశ్శబ్దంగా, గంభీరంగా - జుమ్మంటోంది. గట్టువెంబడిచెట్లు దూరంగా, అస్పష్టంగా మాయగా వెనక్కు పోతున్నాయి. దగ్గరగా ముందున్నవన్నీ, రొప్పుకుంటూ - ఎదురుగాలిని చీల్చుకుంటూ పోతున్న రైలు వేపు, తెల్లబోతూ, ఎప్పుడూ చూడనట్లు, కొమ్మలు విరబోసుకుని వెన్నెల్లో వింతగా చూస్తున్నయ్. తెలుగు తెలియని ‘అరవమేళం’ మావేపు చూస్తూ తమలపాకులు నములుతూ రణగొణధ్వని చేస్తూ మాట్లాడుకుంటున్నారు.

నాలుగైదు రోజుల్నుంచీ సరిగ్గా నిద్రలేకపోవడంచేత మగవాళ్ళు మెల్లిగా అక్కడక్కడ స్థలం చూసుకొని నిద్రపోతున్నారు. అనసూయా, నిర్మల, తుల

సమ్మా, సౌభాగ్యం ఒక్కో బెంచీకి ఇద్దరు చొప్పున పడుకుని కునుకులు తీస్తున్నారు. కిందపడుకున్న 'మనుమల'మధ్య స్థలం చేసుకుని 'కొంచెంసేపుకూర్చోమ్మా ఒగంటసేపు నిద్రపోయి లేస్తాను' అని అనసూయ అత్తగారు నాతో చెప్పి పడుకుంది.

తెల్లగా-పాలతొడుగులా మెరుస్తున్న వెన్నెల్లో, తనకేమీ పట్టనట్లు, తెలియనట్లు శబ్దం చేసుకుంటూ, ముందుకు దొరుచుకు పోతున్న రైలుని గురించి ఆలోచిస్తూ కిటికీ ప్రక్కగా కూర్చున్నాను. మాపెట్టెలో దూరంగా సిగరెట్ పొగలు, చుట్టపొగలు, అప్పుడప్పుడు మాటలు మెల్లిగా వినబడుతున్నాయ్! పెట్టెలోని ఎలక్ట్రిక్ లైట్లు రెప్ప వేయకుండా జాగ్రత్తగా చూస్తున్నాయి.

ఎక్కణ్నుంచో దిగివచ్చి, నాకెదురుగా ముడుచుకొని పడుకున్న సౌభాగ్యంబల్లమీద, ఆమె పక్కనేవున్న కాస్త ఖాళీస్థలంలో, కళ్ళు నులుముకుంటూ కూర్చుని 'మీరింకా నిద్రపోనే లేదా?' అన్నాడు బసవయ్య.

నల్లని వెంట్రుకలు నుదురుమీద పడి మెరుస్తో, చెంపలమీదికి జారి మిలమిలలాడుతూన్న ఎలక్ట్రిక్ లైట్ల కాంతిలో బసవయ్య తమాషాగా కనిపించాడు. బలమైన ఆచేతులవేళ్ళు సున్నితంగా మృదువుగా కళ్ళను నులుము కుంటున్నకొద్దీ, ఒక్కక్షణంసేపు ఆశ్చర్యంగాచూసి, ఆ ప్రశ్నను నేనువిననట్లుగా ఫూరుకున్నాను

'పాపం నిద్రపోనట్లున్నారు. అర్థరాత్రికూడా దాటింది' అన్నాడు.

కోర్కెల్ని రేకెత్తించే ఆ కళ్ళనించి చూపుల్ని తప్పించుకుని 'నాకు నిద్రరావడంలేదు. వెన్నెల్లో పొలాల్ని చూస్తూ కూచున్నాను' అన్నాను.

గాలి అంతకంతకు బాగా వస్తోంది. రైలు కొంచెం వేగంగా పోతూంది. గాలికి రేగుతున్న క్రాపువెంట్రుకల్ని వెనక్కు నెడుతూ 'కొంచెంసేపు పడుకోండి. నిద్ర లేకపోతే జబ్బుచేస్తుంది' అన్నాడు.

ఎంతో మృదువుగావున్న ఆ మాటలు కలుపుగోలుతనం - చిరునవ్వులు, కళ్ళల్లోని వెలుగు... తెలియకుండానే బండి ఎక్కేప్పుడూ, దిగేప్పుడూ - సామాన్లు అందించేప్పుడూ కలిగే స్పర్శానుభూతీ, ఆశగాచూసే చూపులు,—ఈఇరవై అయిదేళ్ళ జీవితంలోఒకసంవత్సరంపాటు అనుభవించిన ఆనందాన్ని మళ్ళీగుర్తుకు తెచ్చినయ్! ఆ ఆనందంలో జవాబుచెప్పేందుకుమాటల్ని వెతుక్కోవలసి వచ్చింది.

'ఎంతసేపని కూచుంటారు? ఒగంటసేపు పడుకోవాల్చండి. నేను మేలుకుంటాను.' తనుచెప్పిన మాటల్ని నేను విననట్లు గ్రహించి మళ్ళీ చెప్పాడు.

ఎంత ఆదరణానురాగం! అందుకనే అనసూయ బసవయ్య తన హక్కన్నట్టు, తనమనిషన్నట్లు ఈర్ష్యగా మావేపు చూస్తుంది. అతను అట్లాగే అక్కడే— నాకెదురుగా ఇంకొంచెంసేపు కూర్చుని మాట్లాడితే బావుండు!

కొంచెంసేపు అలానే ఆ కళ్ళల్లోకి చూస్తూ, ఏదైనాసరే మాట్లాడుతూ నాకెదురుగా కూర్చునేందుకు 'కుంభకోణం నించి మనం ఇంకా ఎక్కడికి వెళ్ళాలి?' అన్నాను మాటల్ని పెంచాలని.

'తంజావూరు.'

'తంజావూరా?'

'ఊఁ!'

'అక్కడచూడవలసినవేమున్నాయ్?'

'పెద్దబస్తీ. దుకాణాలు. శివాజీ చక్రవర్తి కింద పరిపాలించబడిన గొప్పకోటా, —ఏదోనదీ, సినిమాలు, కాఫీ హోటళ్లూ...'

నాకు నవ్వువచ్చింది. 'వెన్నెలరాత్రులు...కొబ్బరితోటలూ—భుజాలు రాచుకోవడాలు, అందంతో మెరిసే అరవ స్త్రీలు, తెలియనిభాషా, అన్నీచూడాలి కదూ! వరుసవారిగా లిస్టురాసుకున్నావా?' అన్నాను.

నవ్వాడు.

'నాకు మాత్రం ఏం తెలుసు? అన్నీ చూస్తేనేగాని చెప్పడం పడదు. చూడందే ఏం చెప్పను?' అన్నాడు.

ఏం మాట్లాడాలో, ఎలా ఆమాటల్ని పెంచాలో తోచలా. కిటికీలోంచి కొంచెంసేపు బైటికిచూసాను. చల్లనిగాలిని నెట్టుకుంటూ రైలు పోతూవుంది. కుందేటి మబ్బులతో ఆడుకుంటూ చంద్రుడు పరుగెత్తుతున్నాడు. చెంపల్ని తాకుతూ పోతున్నగాలిస్పర్శ ఎనిమిది సంవత్సరాల క్రింద జరిగిపోయిన మధుర రహస్యాల్ని వెన్నెలరాత్రుల్ని జ్ఞాపకంచేస్తూ, గిలిగింతలు పెడుతూవుంది. పెట్టెలోని జనమంతా నిద్రపోతూ, కునుకుతూ—నిద్ర నింపుకున్న మైకంతో తూగుతున్నారు. ఆలోచనలతో, జ్ఞాపకాలతో వొళ్లంతా బాగా వెడెక్కినట్లుంది. చాపుకున్న కాళ్ళని దగ్గరికితీసుకొని, నాకెదురుగా—ఎదురు బొదురుగా కూర్చునేందుకు అవకాశమిచ్చినట్లు, జరిగి—సర్దుకుని, ఆ 'ఇరుకులో ఎంతసేపు కూచుంటారు. యిక్కడ కూర్చోండి' అన్నాను.

చిరునవ్వు నవ్వి 'అక్కే! ఫర్వాలేదులెండి. మీరు పాపం నిద్రపోనేలేదు. కొంచెంసేపు పడుకోగూడదూ?'

సౌభాగ్యం చేతుల్ని, మెత్తనిబుగ్గల్ని ముట్టుకునేందుకు ఆకళ్ళూ, మనసూ మహా బాధ పడుతున్నయ్! 'ఎందుకలా చూస్తావ్. మీ ఆడాళ్లబుద్ధెప్పుడూ ఇటువంటిదే. పడుకోరాదూ?' అన్నట్లు ఆచూపులు చెప్పినయ్! ఈర్ష్యగా చూసినయ్!

నేను జవాబు ఇవ్వకుండా ఊరుకున్నాను. జరుగుతున్న పరిస్థితినీ, అతని వాలకాన్నీ — చూస్తున్నకొద్దీ, నాకు పూర్తిగామతిభ్రమ కలిగినట్లయింది. అమాయకంగా ఆశతోచూసే నాగుండ్రనికళ్లనీ పట్టుకుచ్చులా మెరిసే నల్లగా వంకిలు వంకిలుగా తిరిగిన ఉంగరాలజుట్టునీ, ఎప్పుడో ఎనిమిది సంవత్సరాలక్రితం అనుభవించిన మధురానుభూతికోసం ఎదురుచూస్తూ ఉబ్బెత్తుగా పెరిగిన వక్షాన్ని, కిటికీలోంచి దూరి గోముగా చెంపల్ని తాకుతున్న వెన్నెలనీ, జారిపోయిన పమిటనీ— మాటల్నీ, చిరునవ్వునీ, ప్రకృతి కలిగించే నాబాధనీచూస్తూ తెలుసుకునేంత సమర్థత బసవయ్యకు లేదా?

నిద్రపోతున్న సౌభాగ్యంకోసం బాధపడేకన్న, మేలుకుని—ఏదో మాట్లాడుతూ నవ్విస్తున్న నావాంఛని గ్రహించి, కొంచెంసేపు దగ్గరగా కూర్చున్నా ఇంత బాధ పడేదాన్నికాదు. చేతులు పట్టుకుని దగ్గరికి లాక్కొనా! చేతులు పట్టుకుంటే

లొంగిపోతాడని ఏమిటో పెద్ద ధైర్యం కలిగింది.

గుండెలు దడదడ లాడాయి !

రొమాన్సు అన్నా, ప్రేమఅన్నా, కథల్లోచదివినంత తేలిక కాదని అప్పుడు బోధపడింది.

అతని ముఖంలో, నీడలా ఏదో బాధ ద్యోతక మయింది. ఏమో చెప్పాలని ఆ పెదవులు కంపించాయి! అతనిస్థితికి బాధపడాలో, నాఅవస్థకి విచారించాలో అర్థంకాలేదు. తెల్లనివెన్నెల కళ్ళముందు వృథాగా పోతోందని దిగులు కలిగింది.

'నీబాధని, ఆవేదనని చంపుకుని ఇతరులకి సుఖాన్ని కలిగించడమే గొప్ప! ఆకలితో బాధపడేవారికి, సౌందర్యాన్ననుభవించేందుకు తహతహలాడేవారికి, దాచిపెట్టకుండా యివ్వడమే పంచిపెట్టడమే, మానవులకి గొప్పకీర్తిని కలిగిస్తుంది. విలువని చేకూరుస్తుంది. అతనిబాధకి అడ్డంగా నిలబడేకన్నముందు నీవాంఛని త్యాగం చేసుకోలేకపోతే నీవ్యక్తిత్వం దేనికి ? ఆ తరువాత నీవెందుకతనికి నీకోరికను చెప్పకూడదు?' ఏమేమిటో ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాను.

టకటకమని శబ్దం చేసుకుంటూ పరుగెత్తుతున్న రైలువేగం, కిటికీలోకి దూరుతున్న గాలిహోరూ, వినపడుతూనే వున్నయ్. ఉన్నట్లుండి కళ్ళుతెరిచాను.

సౌభాగ్యం నున్నని చెంపల్ని తన పెదిమలతోతాకి, మెల్లిగా ఆచెంపల మీదినుంచిలేస్తూ, నావేపు తృప్తిగా చూసి చిరునవ్వు నవ్వాడు.

'నాకంతా తెలుసులే' అన్నట్లు ముసిముసిగా నవ్వుతూ బసవయ్య వేపు చూసాను. బల్లమీదినుంచి లేచి విశ్రాంతి తీసుకుంటున్నట్లు హాయిగా గాలి పీల్చుకుంటున్నట్లు దూరంగా వెళ్ళి నిలుచున్నాడు. అలసట తీర్చుకున్న లోకం నిద్రమేలు కోబోతూవుంది. అక్కడక్కడ రైలుకట్ట వెంట—పాలికాపులు, రైత్వకూలీలు నడుస్తూ కనబడుతూవున్నారు.

లోకం మీదకు వస్తున్న తూర్పురేఖలతోపాటు మెల్లిమెల్లిగా అందరూ మేలుకున్నారు.

*  *  *

డబ్బువల్ల ఎన్నెన్నిపనులు చేయవచ్చో, ఏయే ప్రదేశాలు తిరగవచ్చో, ఎంతెంత సుఖాన్ని అనుభవించవచ్చో, ఏయే కోరికలు నెరవేర్చుకోవచ్చో మద్రాసు, చిదంబరం, కుంభకోణం—తంజావూర్లుచూసి, అక్కడి పరిస్థితులు, వాళ్ళ ఆచారవ్యవహారాలు, సాంప్రదాయాలు తెలుసుకునేందుకు నాకేవిధమైన ఇబ్బందీ కలగక పోయేప్పటికి, దానివిలువ నాకు బాగా అర్థమైంది.

తినడం, తిరగటం—ఆవూళ్ళో వున్న విశేషాల్ని 'విచిత్రాల్ని' మ్యూజియముల్ని చూడడం, ఆడాళ్ళందరం పిచ్చాపాటీ మాట్లాడు కోవడం, సినిమాలకి వెళ్ళడం మాకు మామూలై పోయింది!

ఫలాపేక్షలేని యాత్రా విశేషంవల్ల, క్షేత్ర దర్శనాలవల్ల, బస్తీలు చూడడంవల్ల— అనేక తరహాల మనుష్యుల్ని, వాళ్ల భాషల్ని, ఆచారాల్ని ఆదేశపు స్థితిగతుల్ని తెలుసుకునేందుకు ఈ ప్రయాణం నాకెంతో గొప్ప ఉపకారం చేసింది!

అక్కడక్కడ పుణ్యతీర్థాల్లో స్నానాలు చేసేప్పుడు, పోయిన భర్తకి పిండాలు వదలమని అనసూయ అత్తగారూ తులసమ్మా, స్వతంత్రించి నాతో చెప్పినప్పటికీ, నమ్మకం లేని పిండప్రదానాల్ని చేసేందుకు నా మనసు వెనక్కులాగేది.

బసవయ్యతో పాటు అందరూ నా మొండితనానికి గుసగుసలాడుకునేవారు నన్ను కాదన్నట్లు తప్పుకు తిరిగేదాన్ని.

ఆ సాయంకాలం అందరం ముస్తాబై మీనాక్షి దేవాలయంలోకి వెళ్లాము. పొద్దున్నే 'మధుర'కి మేము వచ్చి మునిసిపల్ సత్రంలో పెద్ద గదులు రెండు తీసుకుని, సామానులు, ట్రంకులూ సర్దుకుని, బడలికవల్ల నాలుగంటల వరకూ హాయిగా నిద్రపోయాము.

గుడిలోని ఎలక్ట్రిక్ లైట్ల వెలుతుర్లో నవనాగరీకంలోని ఫ్యాషనలతో తయారైన నా దేహ సౌందర్యం, చేతులనునుపూ, ఉంగరాలు తిరిగి మెరుస్తున్న నల్లని వెంట్రుకలూ, తెలియని బాధతో అమాయకంగా చూసే కళ్ళూ, దేవాలయం గోడలకి, స్తంబాలకి తగిలించిన పెద్దపెద్ద అద్దాల్లో మెరుస్తూ ప్రతిఫలిస్తున్నయ్.

నా సౌందర్యం నన్నే ఎంతో మురిపించింది. బావమరుదులతో మాట్లాడుతూ, భార్యని 'పూలు' తీసుకోమని హెచ్చరిస్తున్న బసవయ్యవంక చూసాను. కండలు తిరిగిన ఆ దేహసౌందర్యం, నేలంపంచెలోనించీ, సిల్కులాల్చీలోంచీ బైటికి తొంగి చూస్తూంది.

బసవయ్యలాంటి అపురూపమైన అందగాడూ, స్త్రీలలో ఇట్టే కోరికల్ని రేకెత్తించే యువకుడూ, కనపడడమే కష్టం! ఎక్కడో ఏపుణ్యానో అటువంటి ఆకర్షణగల మగవాడు కనబడి- ఆడదాని జన్మని వెలిగించి, జీవితాన్నంతా మధురాతి మధురంగా, గొప్పగా చేయడం దుర్లభం!

ఆగొప్పతనం- ఆఅదృష్టం కలగడం వల్లే అనసూయ తనను తాను మరిచిపోయి, ఆఅందాల రాసిని ఎత్తుకుపోతారనే దిగులుతో ఈర్ష్యగా నలుగురివేపూ చూసేది.

ప్రేమతో నిండిన పక్క చూపులతో చిరునవ్వు నవ్వుతున్న కొద్దీ, మనసు స్వాధీనం తప్పి- తిరగబడి అతని దగ్గరికి పరుగెత్తేది.

తల వెనక చక్రాకారంగా వున్న 'ఆర్కు' లైటు కాంతిలో 'మీనాక్షి దేవి' మెరిసి పోతూవుంది. మెడలోని పూలదండలూ, మైసూర్ గంధపుధూపం గుడిలోని గంటల మోతా, దూరంగా మోగుతున్న నౌబత్కానా బ్రాహ్మణుల మంత్రోచ్చరణలూ, ముత్తైయిదుల తల్లోని కమ్మని గులాబీ, సంపంగి పూల వాసనలతో పాటు, కొత్తబట్టల తాలూకు వింతవాసనా అనురాగంతో కూడుకున్న అమ్మవారి నిశ్చలమైన చూపూ, ప్రేమపూర్వకమైన చిరునవ్వూ, ఎలక్ట్రిక్ లైట్ల కాంతిలో నొసట మెరుస్తున్న రత్నాల తిలకం, భక్తి ప్రపత్తులతో పూజ చేస్తున్న జనం...ఎంతో గొప్పగావుంది! చూస్తున్నకొద్దీ దేవి అభయమిస్తున్నట్లుంది. నన్ను నేనే మరిచిపోయాను.

'అంతా వెళుతున్నారమ్మా రా!' అని తట్టింది సౌభాగ్యం.

ఎక్కడెక్కడో తిరుగుతున్న భావనా ప్రపంచంలోంచి మేలుకున్నాను. అన్నీ మామూలే! గుడి, ఎలక్ట్రిక్ లైట్లు, వెళ్ళే వాళ్ళ గోలా ప్రసాదం కోసం చిన్న పిల్లల ఏడుపులు చుట్టుకున్నయ్.

*　　　*　　　*

అందరితోపాటు వాళ్ళ వెనక మెల్లిగా నడుస్తున్నాను. నాపక్కనే సిగరెట్ కాలుస్తూ, ఏదో ఆలోచిస్తూ బసవయ్య వస్తున్నాడు. ఆ బావమరుదు లిద్దరూ భార్యలకి, పిల్లలకి, ఏమేమిటో దూరంగా ఉన్న కొట్లదగ్గర కొంటున్నారు. అనసూయ, నిర్మల బసవయ్య చెల్లెళ్లూ, తల్లీ తులసమ్మా, బట్టల్ని గురించి — మధురలో చవకగా దొరికే వస్తువుల్ని గురించి మాట్లాడుకుంటూ ముందు పోతున్నారు.

సౌభాగ్యం ఏదో ఆలోచిస్తూ మెల్లిగా వెళ్తోంది. నావేపు ఒకసారి కృతజ్ఞతతో చూసి, బసవయ్య ఆమె పక్కగా వెళ్ళి మాట్లాడేందుకు ప్రయత్నించాడు. చూసీ చూడనట్లు, వినీ విననట్లు, ఏదో ఆలోచిస్తున్నట్లు వాళ్ల వెనక నడిచాను. "ఇవాళ తప్పదు."

"అవతల సునందవస్తోంది. మన మాటలు వింటుందేమో ?"

ఒక్క క్షణంసేపు ఆశ్చర్యపోయాను. ఏమీ తెలియనట్లు, నంగనాచిలా నటిస్తున్న సౌభాగ్యం కళ్లు నాముందు బైట పడింది. అందుకనే ఆడవాళ్లని గురించి, వాళ్ళనటననుగురించి, ఆమాటల్ని గురించి, ఆలోచించి తప్పుకునే సామర్థ్యం పెద్ద పెద్ద కబుర్లు చెప్పే ఈవిజ్ఞానవంతులకూ, మన స్త్రీవేత్తలకుకూడా, వుండవనేసత్యం రుజువైంది.

"ఫర్వాలేదు, సునంద ఏమీ చేయదు."

"ఏమో ?"

"నేచెబుతున్నాగా. రాత్రికి రేపు తావుకదూ ?"

తమాషాగా బసవయ్యవేపుచూసి నవ్వింది. ఆ కళ్ల కాంతికి బసవయ్య ముగ్ధుడై పోయాడు. రోడ్డుమీద జనం వుండటంచేత వూరుకున్నాడుగాని లేకుంటే ఆ చేతుల్లో సౌభాగ్యం నలిగిపోయేదే !

బసవయ్యకళ్ళు ఎరుపెక్కి ఉధృతంగా చూసాయి!

ఈరాత్రికి తప్పకుండా సౌభాగ్యం బసవయ్య హృదయంలో నిద్రపోతుంది! ధైర్యమూ, సాహసమూ, తెలివితేటలూ వుండటంచేత సౌభాగ్యం ఆనందాన్ని అనుభవిస్తోంది! ఇద్దరమూ ఒకే ఈడులో వున్నా, ఆమె ఉత్సాహాన్నీ సంతోషాన్నీ నాలుగువేపులనించీ పోగుచేసుకుంటుంది. కోర్కెలూ, వాంఛలూ, తృష్ణా ఎంతగొప్పగా మనసులో తిరుగుతున్నా అనేవాళ్ళు అడిగేవాళ్ళు లేకపోయినా — ఆకలి అయినపుడు, కోరిక కలిగినపుడు, దొంగతనం చేసయినా కడుపు నింపుకోవడం — వాంఛ తీర్చుకోవడం ఉత్తమమని తెలుసుకోనికూడా, నిరర్థకమైన జీవితానికి అలవాటు పడిపోయాను.

మెల్లిగాదగ్గి నవ్వాను.

ఏదో చెబుతున్నదల్లా ఉలిక్కిపడి తలెత్తి నావేపుచూసి — చూడనట్లు గబగబా అడుగులు వేసుకుంటూ ముందుకు వెళ్ళిపోయింది.

"ఏమిటి సునందా?" అన్నాడు బసవయ్య. ఎంతగర్వంవుందికి ఆంతంలో!

"ఏం లేదు."

ఎందుకో, ఏమో, నావేపు జాలిగా, బాధగా చూస్తూ నేను తెలుసుకున్నట్లు గ్రహించాడులావుంది. "నాగురించన్నా ఈసంగతిమనసులో దాయాలి." అన్నాడు.

ఆకంఠంలోంచి బైటికివచ్చిన బొంగురు పోయిన మాటలు నామనసుని ఆక్రమించి అతడంటే విపరీతమైన జాలినీ ఎన్నడూ కలిగనంత ప్రేమనూ కలిగించినయ్! ఓ క్షణంసేపు చిన్నప్పటి మాఆటలు, కొట్టుకోవడాలు, గిచ్చుకోవడాలు, చదువులు, పంతాలు, అన్నీ గుర్తుకువచ్చినయ్. కులస్తులం కానందువల్ల మాఇద్దరి వివాహం ఆగిపోయింది కానీ మాపెద్దలకు అభ్యుదయ భావాలున్నట్లయితే అనసూయ స్థానంలో నే నుండేదాన్ని! ఆహక్కు నాకు ఏర్పడేది! వెనక్కు దువ్విన నల్లని క్రాపు బంగారు తీగల్లాగా సన్నని ఆవేళ్ళు మెరుపులాంటి కాంతిగల ఆకళ్ళు నాహృదయాన్ని చుట్టుకున్నాయ్.

'మిమ్మల్నిద్దర్నీ బాధపెట్టేంత నీచానికి దిగనులే.'

వూపిరి పీల్చుకున్నట్లు, హృదయంలోని బాధ తొలిగినట్లు, కృతజ్ఞతాపూర్వకమైన కళ్ళతో నావేపు చూస్తూ చిరునవ్వునవ్వాడు.

* * *

భోజనాలు ముగించుకుని పడుకునేప్పటికి పది గంటలు దాటింది. సత్రంలోని యాత్రీకులందరూ పక్కలు పరుచుకుని, ఏవేవో మాట్లాడుకుంటూ పడుకున్నారు.

బయల్దేరింది లగాయతు బసవయ్య సౌభాగ్యంవేపు చూసే చూపులు, ఆ[illegible]లు - రైల్లో ఎవరూచూడడంలేదని, ఆచెంపల్ని ముద్దుపెట్టుకోవడం - సౌభాగ్యాన్నీ, అప్పుడప్పుడు నన్నూ రాచుకు తిరగడం,- మరిచిపోయిన అనుభూతిని జ్ఞాపకంచేస్తూ, హృదయాన్ని ఉద్రేకపరిచినయ్.

ఎంతసేపు పడుకున్నా నిద్ర పట్టనే లేదు. ఎన్నెన్నో నిద్రరాని ఆలోచనలతో అలానే పక్కమీద దొర్లాను. పెద్దలైట్లు ఆర్పి, చిన్నలైటును ఎప్పుడు వేశాడో నాఆలోచనలలో గుర్తించనే లేదు. సౌభాగ్యం పక్కమీద వుందో, లేదో, చూసి మళ్ళీ పడుకున్నాను.

గడియారం పన్నెండు గంటలూ కొట్టింది. యాత్రికులతోపాటు, మావాళ్లు కూడా అందరూ గురకలు తీస్తున్నారు. గోడమూలల్లో, స్తంభాల పక్కపక్కల దాక్కున్న నీడల్ని, చీకటిని తరమలేక చిన్నలైటు గుడ్డిగా చూస్తోంది.

సత్రమంతా దిగులుగా, గుబులుగా, నిశ్శబ్దంగా వుంది. ఆలోచనలు హృదయాన్ని ఉద్రేకపరుస్తున్నయ్.

కొమ్మ ఆధారంతో లత ఎందుకని పాకుతుందో,

వెన్నెలలో మనస్సుఎందుకు ఉద్రిక్త పడుతుందో,

అందమైన గులాబిని, కమ్మని సువాసనల నిచ్చే సంపంగిని, చేతుల్లోకి తీసుకునేందుకు ఎందుకని ఆతురతపడతామో,

భూదేవి వస్తువుల్ని తనవేపుకు ఎందుకని ఆకర్షిస్తుందో,

ఆ కారణాలతోనే, సౌభాగ్యాన్ని బసవయ్యాలను చూస్తూ నిద్రపోతూన్న కోర్కె ఒక్కసారి విజృంభించింది. ఎం

చేద్దామన్నా, ఏం చేయాలన్నా అంతు లేని ఆలోచనలు ఒకదారికూడా తీసుకు పోలేక పోతున్నయ్.

మెల్లిగా లేచి - తొట్రుపడుతున్న కాళ్ళతో, బసవయ్య పక్క వద్దకి వెళ్ళి, మెల్లిగా కాలు గీకాను.

చప్పున లేచి కూర్చున్నాడు. చీకట్లో స్తంబం పక్కన నిలుచుని, ముసుగు సవ రించుకుంటూ, మాట్లాడవద్దని సైగచేసాను.

బనీనులోంచి బైటికి తొంగిచూసే ఎత్తయినఛాతీ, నున్నని బలమైనచేతులూ, చక్కని కళ్ళూ, సౌభాగ్యంకోసం వేగిర పడుతున్నైలా వుంది; పక్కమీదినుంచి మెల్లిగా లేచాడు. మొట్టమొదటిరాత్రి అనుభవంలోని ఆనందం, మళ్ళీ ఈజీవి తానికి పూర్వుల పుణ్యంవల్ల కొట్టుకు వచ్చిందేమో, ఇంతచక్కని మధురతమ క్షణం,— ఈ నిర్భాగ్యురాలి జీవితంలో వుంటుందని అనుకోలేదు.

తల వొంచుకుని అడుగుల్లో అడు గులు వేసుకుంటూ, మెల్లిగా మాసామా నుల గదిలోకి వెళ్ళాను.

చీకట్లో తడుముకుంటూ, గదిలో అడుగుపెట్టేప్పటికి, తలుపులు వేసాను. నడుంచుట్టూ చేయిపోనిచ్చి దగ్గరకు లాక్కుంటూ, రెండోచేత్తో నాముఖాన్ని దగ్గరికి తీసుకుని, రేకలురాలిపోతాయేమో నని, పువ్వును సున్నితంగా, మృదువుగా, ఆశగా వాసనచూసినట్లు నాబుగ్గలమీద ముద్దుపెట్టుకున్నాడు.

నాహృదయం విచ్చుకుంది. ఆనందం తో శరీరం పొంగిపోయింది. కలేమోనని, చెడిపోతుంమోనని, ఈసుఖం యిక రాదేమోనని, హృదయానికి గట్టిగా అదుముకున్నాను.

కళ్ళుబాగా తెరిచిచూసి 'సునందా?' అన్నాడు.

కొన్ని క్షణాలపాటు ఏమీ తెలియక అర్థంగాక 'అవును నేనే! ఎందుకీ సంశ యం?' అన్నాను.

నా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, అతని హృదయాన్నీ, చేతుల్నీ తొందర పెట్టి నయ్. నాబాధనీ, ఆశనీ, కోర్కెనీ అర్థంచేసుకుని, కలల్ని నిజంచేసేట్లు బల మైన ఆచేతివేళ్ళు మెల్లిగా బాడీలేని జాకెట్ లోకి పాకాయి.

మధురమైన కోర్కెలకి, ఆడదాని వాంఛలకి, ఆశలకి, మూల రహస్యం తెలుసుకున్నట్లు, చేతివేళ్ళు రొమ్ముల్ని తాకుతున్నకొద్దీ, ఉద్రేక పడుతున్నట్లు ఆ హృదయానికి అదుముకుంటూ, మీదికి వొంగి చెంపల్ని తనపెదిమలతో స్పర్శి స్తున్నకొద్దీ, గిలిగింతలు పెడుతున్నట్లు నన్ను నేను మరిచిపోయి వూగిపోయాను.